



గన్ను కృష్ణమూర్తి

"బీదోళ్లందరికీ కలర్ టీవీ పెట్టెల్ని పంచుతారట!" అన్నవార్త దావానంలా ఊరు ఊరంతా వ్యాపించింది.

"ఇంతకు మనం బీదోళ్లమా కాదా?" అన్నసందేహం వచ్చింది యెంకులు బిచ్చగాడికి.

"బీదోనిలే! కాదన్నదెవడు? కని, తెల్లకారటుండాలె గద? ఉన్నదా నీ తాన?" అడిగాడు సోములు, తోటి బిచ్చగాడు.

"తెల్లకారటా? లేదుగద!" అన్నాడు.

"అయితె, యియ్యరు" తేల్చి చెప్పాడు సోములు

యెంకులు టీవీ కలలన్నీ పగటికలల్లా చెదిరిపోయాయి. తిండి మానేసి, బిచ్చం మానేసి చెట్టు కింద వొరిగాడు.

ఆయన దిగులేమిటి' తెలుసుకున్నాడు ఐదేళ్ల పోరడు లచ్చులు. లచ్చులంటే యెంకులు చిన్నకొడుకు.

"నీకు తెల్లకారటు గావాలె! అంతె గద?" అడిగాడు అయ్యాపక్కలో జేరి. "ఐతే, కూడు తిను! నేనే దెస్త గద!" అన్నాడు.

"లేదు. నువు కారటు తేవాలె. నేనెంగిలి పడాలె!" భీష్మించుకున్నాడు యెంకులు.

"సర్లే! అట్లనే!" నంటూ, అలాగే దిసమొలతో తుర్రుమన్నాడు లచ్చులు.

వెళ్లి ఓ రేషన్ షాపు దగ్గర, మూల మీద, చెట్టు చాటున మాటేశాడు.

పబ్లిక్ వెళ్తోంది, వస్తోంది సరుకుల్తో! పావుగంట, అరగంట, గంట గడిచిపోయింది.

చివరికి ఓ ఐదారేళ్ల పిల్ల చేతిలో తెల్ల కార్డుతో ఆడుతూ, పాడుతూ వెళ్తోంది. అదను చూచి, లచ్చులా పిల్లపైబడి, తెల్లకార్డందుకొని, ఉడాయించాడు, ఆగకుండా, వెనక్కి తిరిగి చూడకుండా! పాపం ఆ పిల్ల ఏడుస్తూనే ఉంది, కార్డు పోయినందుకు.

తెల్లకారటు దొరికిందని తెగ మురిసిపోయాడు యెంకులు. పోరగానికి పుల్ల ఐస్ క్రీమ్ కొనిపెట్టాడు. వెంటనే చిరుగుల చొక్కాను ఒంటికి తగిలించుకొని, పచ్చరంగు పార్టీ ఆఫీసుకెళ్లి నుంచున్నాడు.

అప్పటికే, అక్కడ 'చేంతాడంత' క్యూ తయారైంది. ఆ లైన్లో నిల్చున్న తెల్లబట్టలవాళ్లు, వీణ్ని దగ్గరకు రానివ్వలేదు. లైనులో నిల్చో నివ్వలేదు. ఆ వరాహావతారాన్ని చూసి అసహ్యించుకుంటూ! ఆ మట్టి కంపు, అ చెమట కంపూ భరించలేక ముక్కులూ, నోళ్లూ మూసేసుకున్నారు.

'లైనూ, గియినూ జాంతా నై'-అన్నట్లుగా, వాళ్ళందర్నీ తోసేసుకుని, నేరుగా లోనికెళ్లాడు యెంకులు, దారాసింగ్‌లా!

వాణ్ని కిందా మీదా చూసి, "ఏం గావాలె?" అంటూ అడిగాడు, అక్కడికార్యకర్త.

"కలల టీవీ!" అన్నాడు నోరంతా తెరిచి.

ఆ కంపుని భరించలేక ముక్కూ, నోరూ మూసేసుకున్నాడా వ్యక్తి.

"కలరు టీవీయా? నీకా? తెల్లకారటుందా?"

"ఉండది!"

"ఏం పేరు?"

"యెంకులు"

"ఐతే, యెళ్లు! రేపు మీ యింటికాడికే వొస్తం!" అంటూ వొదిలించుకున్నాడు, చిట్టీ చేతిలో పెడుతూ.

"బిన్న రావాలె మరి!"

"బిన్ననే వస్తంగని, నీ యిల్లెక్కడ?"

"గిన్నే! పాతకుంటల... చింతల తోవులల్ల!" అంటూ, తన అడ్రసు చెప్పి వచ్చేడు విజయగర్వంతో.

కండ్లల్ల వొత్తులేసుకొని, ఎదురుచూడసాగారు, యెంకులూ ఆయన పిల్లాపీచూను.

ఆ రోజు రానే వచ్చింది. రిజిస్టర్లు, లిస్టులు పట్టుకొని, కొందరు కార్యకర్తలు ఇల్లిల్లు తిరుగుతూ, పాత కంటలోని చింతల తోపుకు రానే వచ్చారు.

యెంకులు వాళ్ళని కలిశాడు.

"ఏడ మీ యిల్లు?"

"ఇదిగో గీడ్నే! సిమెంటు పైపుల కాడ!" అన్నాడు. వాళ్లంతా వాడి వెనకాలే వెళ్లారు.

అక్కడ, చింతచెట్లు, వేపచెట్లు, బేశరమ్ చెట్లూ, వాటి పక్కనే సిమెంటు పైపులున్నాయి. తప్ప యిండ్లు లేవు.

"ఏదిరా నీ యిల్లు?" గద్దించాడాయన.

"గిదే మాయిల్లు! గిదే మా గూడెం!" అంటూ చెట్లనీ, పైపుల్నీ చూపించాడు.

ఒక పైపు లోంచి మగపిల్లలూ, మరో పైపు లోంచి ఆడపిల్లలూ బిలబిలమంటూ బయటపడ్డారు, గంప కింద కోడిపిల్లల్లా! చెట్ల కొమ్మల సందుల్లోంచి మరి కొంతమంది మగపోరలూ కిందికి దూకారు, ముసుగు వీరుల్లా!

"ఇగ్గో గీళ్ళే మా వోళ్ళు!" అంటూ చూపించాడు యెంకులు.

వాళ్ళంతా తెగనవ్వుకున్నారు. ఆశాల్తీల నన్నిటినీ లెక్కెట్టుకుంది ఓ పచ్చ టోపీ! మొత్తం ఇరవై ఏడుగురు లెక్క తేలారు, అశ్వీన్యాది నక్షత్రాల్లా!

"నీ కారటేది?"

భద్రంగా తన రొంటిలో దోపుకున్న తెల్లకారటు దీసి, చేతికిచ్చాడు.

"గిది నీదేనా? ఏడన్న దొబ్బు కొచ్చినవా? ఐనా దీంట్లె గోవిందని పేరున్నది గద?"

"నాదే దొరా, గోవిందని ఉన్నదా? అరె, పెద్దపోరడ! గోవిందూ! గిట్ల రారా!" అంటూ కేకేశాడు.

ఆ మంద లోంచి ఓ పొడుగాటి శాల్తీ ముందుకొచ్చింది.

"నీ పేరేంటి?"

"గోవిందు."

"ఐనా, నీకు గుడిసె లేదు గద? టీవీ ఇవ్వం!" అన్నాడావ్యక్తి.

"గుడిసెక్కడి ద్దొరా! అడుక్కతినెటోళ్ళం! నిరుడు జాగలిస్తమన్నారు! యియ్యలే! యిస్తె గుడిసేసుకుందు!"

"ఐనా, నీకు గుడిసె లేదు గద? టీవీ ఇవ్వం!" అన్నాడావ్యక్తి. "గుడిసెక్కడిద్దొరా! అడుక్కతినెటోళ్ళం! నిరుడు జాగలిస్తమన్నారు! యియ్యలే! యిస్తె గుడిసేసుకుందు!"

"గట్లయితె ఇచ్చేది లేదు!"

"గట్లంటె ఎట్ల దొరా! నీగులాపోళ్ళం! సాన ఆశెపడి ఉన్నం. సచ్చి మీ కడుపుల బుడతాం! ఎట్లన్న జేసి, సిన్నదో, సితకదో యియ్యండి దొరా! అండ్ల మీ బొమ్మల్ని చూసుకుంటం!" అంటూ, కాళ్ల మీద పడ్డాడు యెంకులు. వాళ్లు కదలకుండా గట్టిగా, ఉడుములా పట్టుకున్నాడా కాళ్లను!

"అన్నా! అన్నా! " అంటూ పక్కనున్న పచ్చ చొక్కా, ఆయన చెవిలో ఏదో గుసగుసలాడింది.

"సరె! యిస్త గనిలే!" అన్నాడు.

వెంటనే లేచి నుంచుని చేతులు కట్టుకున్నాడు యెంకులు. "దొరా, పున్నెం గట్టుకోండి" అన్నాడు వినయవిధేయతలతో.

"మరి? మాపార్టీకి ఓటేస్తవా?"

"యేస్త దొరా! మా వాళ్ళతోని గూడ యేపిస్త!"

"ఎందరు నీకు కొడుకులు, బిడ్డలు?"

"నేనూ, మా ఆడదీ, మా పోరలూ, పోరీలూ, గల్సి ముప్పై మందుంటం! మా సుట్టాలు పక్కాలు గలిస్తె యాభైమంది దాకయితం!"

"ఆల్లతో సుతమేపిత్తరా?"

"తప్పకుంట దొరా! యెంకులు మాటిస్తే మాటే! పానం పోయినా మాట దప్పడు!" అన్నాడు.

"ఇచ్చెయ్" అంటూ ఆర్డరు జారీ చేశాడా వ్యక్తి.

వెంటనే, వ్యాను లోంచి టీవీ పెట్టెని మోసుకొచ్చి, యెంకులు చేతిలో పెట్టాడు కూలీ. నెత్తిన పచ్చ టోపీ పెట్టి, పుస్తకంలో యెంకులు యేలి ముద్రలు వేయించుకొని, వెళ్లిపోయారు వాళ్లు.

వెళ్లేముందు- "నిప్పుకు దూరంగ ఉంచండి! నీళ్లు బడకుండ సూస్కోండి! మీద బరువులు పెట్టకండి!" అంటూ, జాగ్రత్తలు చెప్పి, వెళ్లిపోయారు వాళ్లు.

"గట్లనే దొరా!" అంటూ తలూపాడు యెంకులు

✿✿✿

వాళ్ళు అట్లా వెళ్లారో లేదో వీళ్లు యిట్లా పెట్టె విప్పి చూశారు. కుక్కపిల్లలా, బొద్దుగా, ముచ్చటగా ఉంది రంగుల టీవీ!

యెంకులు భార్య రంగి, పసుపూ, కుంకాలూ చల్లి, నీళ్ళు చిలకరించింది పెట్టె మీద. దండం పెట్టుకుంది.

"అయ్యయ్యో!" అంటూ, పోరలంతా అరిచారు నీళ్లు పడ్డందుకు. యెంకులు తన లుంగీతో దూడను తుడిచినట్లుగా ఒక్క నీటి చుక్కైనా మిగలకుండా తుడిచేశాడు శుబ్బరంగా!

పోరలంతా చేరి, "టీవీ పెట్టయా!" అంటూ గోల చేశారు. దాని మీటలన్నీ తిప్పి చూశాడు యెంకులు. కానీ, టీవీ పలకలేదు. బొమ్మలు కనిపించలేదు.

ఇంతలో చెట్టు కింద పొయ్యి రాజేస్తున్న రంగి, పగలబడి నవ్వింది.

"ఏందే నవ్వుతవ్.. పెద్ద తెలిసినట్టు" అరిచాడు యెంకులు.

"నిప్పు లేకుండ వంటనే కాదు. ఇగ టీవీ ఎట్ల పలుకుతది?"

"అంటే? టీవీకి నిప్పు పెట్టమంటావా ఏంది?"

"కాదయ్యా! కరెంటు! కరెంటు కావాలె!" అన్నారు పోరలు.

"ఓసోసోసి!నా దివాకు పంజెయ్యకపాయె! కరెంటు లేకుంటె ఎట్ల పల్కుతది?" అంటూ నవ్వసాగాడు, రమణారెడ్డి యాక్టరులా!

"ఎట్ల మరి?" అందరూ ఆలోచనలో మునిగారు.

"సముద్రంలనె ఉండి శేపలు దూపకేడ్చినట్లు, కరెంటు వైర్ల కింద ఉండి, కరెంటు కోసం ఏడుత్తున్నాం!" అన్నాడు పెద్దోడు నవ్వుతూ.

"బలుబు ఎగిలించినట్టే టీవీ ఎగిలించాలె!" అన్నాడు యెంకులు.

పెద్దాడు చెట్టెక్కి, చెట్టుకొమ్మల్లో దాచిన వైర్లూ, పంగల కర్రా కింద ఏడేశాడు.

కర్రకి కొక్కాలు సరిచేసి, పైనుండి వెళ్లే వైర్లకి తగిలించాడు. వైరు కొసల్ని టీవీ రంధ్రాల్లో దూర్చాడు.

ఇంకేముంది? టీవీలో ఎర్ర లైటు వెలిగింది. అన్ని మీటలూ త్రిప్పి చూశారు. టీవీ తెర మీద పచ్చరంగు చొక్కాలూ, టోపీలూ దర్శనమిచ్చాయి, రోడ్డు మీద ధర్నా చేస్తూ, నినాదాలిస్తూ!

పోరలంతా లేచి, గంతులేయసాగారు ఆనందం పట్టలేక.

అంతే ఇక! టీవీలో తలలుదూర్చారు. నిద్రాహారాల్ని, కాలాన్నీ మరచి, టీవీ లోకంలో తేలియాడారు. సముద్రంలో ఈదారు! గాలిలో తేలారు! పబ్బుల్లో దూరారు! దేశదేశాలన్నీ తిరిగొచ్చారు! శరీరాలు భూమ్మీదున్నా మనసంతా ఊహాలోకంలోనే!

అర్ధరాత్రయింది. కళ్లు మూతలు పడుతున్నాయి. ఒళ్లు తూగుతోంది. ఐనా ఒక్కరూ లేవడం లేదు. టీవీ మాయాభూతం వదలడం లేదు. రంగుల వలలో బందీలైపోయాయి పసిప్రాణాలు.

"ఆకలి రుచెరుగదు-నిద్ర సుఖమెరుగదు" అంటారు. అది వాళ్ల పట్ల అక్షరాలా నిజమైంది.

ముందు చిన్నోన్ని ఆవరించింది నిద్రాభూతం. వాడు టీవీ మీదే ఒరిగిపోయాడు. వాణ్ని చూసి నవ్వుకున్నారంతా! ఆపై నడిపోడు అదే పని చేశాడు! మళ్లీ నవ్వుకున్నారు. ఆపై ఒక్కొక్కరుగా, ఎక్కడివాళ్లక్కడే ఒరిగిపోయారు. చిత్రవిచిత్రభంగిమల్లో!

అర్ధరాత్రి! విశాలాకాశం కింద! భూదేవి ఒళ్లో!

టీవీ పాదాల చెంత! చి ంత చెట్ల సాక్షిగా! ఇద్దరు!

నిద్రను జయించిందల్లా ఇద్దరే ఇద్దరు! ఒకరు రంగి, రెండోది యెంకులు!

పోరల్ని జూచి లోలోనే నవ్వుకున్నారు వాళ్లు.

"లెగండిరా! లెగండి! యింత కూడు తిని పండండి!" అన్నాడు యెంకులు. ఎవడూ లేవలేదు.

టీవీ కట్టేసి, వాళ్లని పక్కకి త్రోసేసి, టీవీ పెట్టెని చేతుల్లోకి తీసుకున్నాడు యెంకులు.

"ఏడ పెట్టమంటావే దీన్ని?" అడిగాడు భార్యని.

"నా నెత్తిన బెట్టు!" విసుక్కుంది రంగి. రోజంతా పంజేసి అలసిపోయి ఉన్న కారణాన

"గట్ల యిసుక్కుంట వేందే? యేల రూపాయిల టీవీ! దొంగా దొరా బయ్యం కదా?"

"గా సైపులల్ల బెట్టి, చెత్తా చెదారం కప్పుదాం!" సలహా యిచ్చేడొక కొడుకు.

"గది బాగున్నది" అంటూ ఓ వైపులో దాన్ని దూర్చి పై నుంచి చెట్టుకొమ్మలూ, కాగితాలూ, చెత్తా కప్పేసి, ఆ సైపు దగ్గరే ఒళ్లు వాల్చారు వారు. క్షణాల్లో నిద్రలోకి జారిపోతున్నారు.

✽✽✽

తెల్లారాక అందరూ పాచి మొహాలతోనే టీవీ దగ్గరకు చేరారు. చెత్తా, చెదారం తొలగించి, టీవీ పెట్టెని బయటకు తీసే ప్రయత్నంలో పడ్డారు వాళ్ళు.

"గుర్ర్ర్!. గుర్ర్!" మన్న శబ్దం వినిపించింది.

"ఏందిర? కరెంటు కనెచ్చను తియ్యలే?" గుడ్లురిమాడు యెంకులు పోరలకేసి చూస్తూ.

"రాత్రి వంటే తీసిన!" అన్నాడొకడు.

"మల్ల, ఏందిర సప్పుడు?" అంటూ చూశాడు.

ఏముంది? వరాహం! ఈనిన పులిలా చూస్తోంది!

ఇట్నుండి దూర సందు లేక, అట్నుండి దూరినట్లుంది పంది, తన పిల్లల్తో సహా! ఇటు వైపు తలా అటు వైపు తోకా పెట్టి "గుర్రు గుర్రు" మంటోంది. "నా నిద్రాభంగం చేశారేమి"టన్నట్లుగా!

పోరలంతా పగలబడి నవ్వారు. కానీ యెంకులు మాత్రం ఖంగు తిన్నాడు.

"ఏడ జాట దొర్కలే? గీడ జేరినవ్? లే! నీయమ్మ లే!" అంటూ దాన్ని, దాని పిల్లల్ని అదలించి, వెడలగొట్టాడు తల్లి గర్భం లోంచి పిల్లను బయటకు తీసినట్లుగా టీవీ పెట్టెను బయటకు తీశాడు భద్రాతిభద్రంగా!



రాత్రంతా ఆ వరాహసుందరి, దాని పిల్లలూ కలిసి, రాకి రాకి, గీకి గీకి, నాకి నాకి, పరిశుభ్రం చేసినట్లుగా ఉంది. అందుకే టీవీ సెట్టు పందికూనలా వాసనేయసాగింది. అంతా కలిసి దాన్ని శుబ్బరం చేయసాగారు. ఒకడు చేత్తో రుద్దితే ఒకడు చొక్కాతో రుద్దాడు. ఒకడు ఉమ్మితో శుబ్బరం చేశాడు. ఇంతలో ఓ కుక్కపిల్ల అటుగా వచ్చి, టీవీ పెట్టెను చూచి, ఆగిపోయింది. దాని చుట్టూ తిరిగి దాన్ని వాసన చూచి అమాంతం కాలెత్తేసింది మూత్రీకరించడానికి!

"లే నీయమ్మ లే!" అంటూ ఓ పోరడు రాతిముక్కను విసిరాడు.

అది కుక్కపిల్లకు తగల్లేదు కానీ, యెంకులు చేతుల్లో ఆ పోరని వీపు మాత్రం పగిలింది.

అప్పుడు పారిపోయే కుక్కపిల్ల కాస్తా ఆగి, వెనక్కి తిరిగి చూసి, యికిలిస్తూ, వెళ్లిపోయింది.

డెబ్బలు తిన్న బాధతో వాడేడుస్తూ, కూడిడిచిపెట్టి వెళ్లి చెట్టెక్కి కూచున్నాడు.

ఆ టీవీని మళ్ళీ శుబ్బరం చేసేసరికి తాతలు దిగొచ్చేరు.

ఆ రోజు పోరలంతా బిచ్చం మానేసి, టీవీకి అతుక్కుపోయారు.

బల్లుల్లా! చివరికి ఒంటికి, రెంటిక్కూడా లేవలేదంటే నమ్మరేమో!

చివరికి పోరలు బట్టలూడదీసుకుని 'ట్విస్ట్ డాన్స్' చేయసాగారు.

ఆనందం పట్టలేక ఆ అర్ధరాత్రి వేళ! ఆ ఓపెన్ థియేటర్‌లో! చంద్రుడూ, చుక్కలూ ప్రేక్షకులుగా!

తిక్క తిరిగి రంగి చీపురుచ్చుకున్నాక గానీ, వాళ్లు పడుకోలేదు. ఇక చిన్నోడేమో సినిమా పాటల్ని, ప్రకటనల నినాదాల్నీ బిట్లుబిట్లుగా పాడసాగాడు. తన అన్నలు 'కోరస్' కాగా!

అట్ల కాడతో అంటించాక గానీ, వాడు పడుకోలేదు.

✽✽✽

తెల్లారాక, మళ్లీ టీవీ చుట్టూ చేరారు పోరలు, బెల్లం చుట్టూ ఈగల్లాగా! ఎంతకీ లేవరు! మొహాల్లేవు! స్నానాల్లేవు!

సినిమాలు, సినిమా పాటలు, డాన్సులు, కుస్తీ పోటీలు, వార్తలు, వింతలు- విడ్డూరాలు. ఒక్కటీ విడిచిపెట్టలేదు. చూడ్డం ఎగరడం! పిచ్చిపిచ్చిగా కేక లేయడం!

"దయ్యాన్ని దెచ్చినట్లు, టీవీ పెట్టెను దెచ్చిండు మీ అయ్య! ఎట్ల జచ్చేదిరా! ఒక్కడు ఒక్క మాటింట లేరు! ఇయ్యాల తిండీ తిప్పలెట్లరా! టీవీ కూడు బెట్తాదిరా?"...అంటూ రంగి కేకలేసింది.

ఆ కేకలకి చెట్టు మీది కాకులన్ని ఎగిరిపోయాయి, మమ్మల్నే తిడుతోంది గామాల్సు, అనుకొని.

కానీ ఆ టీవీ కాకులు మాత్రం వినిపించుకకోలేదు. టీవీ దగ్గర్నుండి కదల్లేదు.

"నేన్ బోతగని, పోరగాండ్ల నేమనకు. టీవీ పెట్టె వున్నెమాని మస్తు ఖుషీగున్నరు. ఉండనీ!" అనుకుంటూ ఊళ్లోకెళ్లాడు బిచ్చానికి యెంకులు.

ఆ పోరలు రంగుల పెపెంచకంలో మునిగారు పీకల్దాకా!

పొద్దు నెత్తికెక్కినా యింటి ముఖం పట్టలేదు యెంకులు.

ఎంత తిరిగినా, ఎంత అరచినా, జోలె నిండలేదు పాపం.

రంగి బోరు నీళ్లు తాగి, చెట్టు నీడన కునుకు తీయసాగింది అలసిన పసరంలా!

పొద్దుపోయాక వచ్చాడు యెంకులు, పాచిన కూటితో!

అయ్యను చూశాక ఆకలి గుర్తుకొచ్చింది వాళ్ళకి.

అందరి కందరూ వాని మీద పడి బొక్కేశారు. అయ్యా, అవ్వల సంగతి మరిచి. మిగిలిన మెతుకుల్ని రంగీ, యెంకులూ గతికారు, ఆ టీవీలోని రంగుల బొమ్మల వంక చూస్తూ, కాసేపు ఆకల్నే కాదు, అంతా మరిచారు.

(మిగతా వచ్చే వారం)